క్లుప్తంగా

నవధాన్యాల సాగుపై అవగాహన



కిత్తమూరిపేటలో నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ చేస్తున్న వ్యవసాయాధికారులు

ప్రత్తిపాడురూరల్: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ఏపీ సీఎస్ఎఫ్ ఐబీ ఎన్‌డీపీ ఎం.మల్లేశ్వరి అన్నారు. మండలం లోని కిత్తమూరిపేటలో రైతులకు శనివారం ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో భూమిలో జీవవైవిధ్యం ఏర్పడి పంటలకు కావలసిన పోషకాలు లభిస్తాయన్నారు. భూమిలో తేమ శాతం పెరగడంతో అధిక దిగుబడులు లభిస్తాయన్నారు. అనంతరం 'నవధాన్యాల సాగు- నేలతల్లి బాగు' అనే నినాదంతో గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రామలక్ష్మి, లక్ష్మణ్, వీఏఏలు మనోహర్, గణేష్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



మల్లేపల్లిలో చిన్నారులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

గండేపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు శనివారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పీహెచ్‌సీ పరిధిలో తొమ్మిది వ్యాక్సినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మల్లేపల్లి, తాళ్లూరు గ్రామాల్లోని వ్యాక్సినేషన్ కేంద్రాలను పెద్దాపురం డీఎంహెచ్‌ఓ సరిత పర్యవేక్షించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కేవీ నరేష్, సూపర్‌వైజర్స్, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలంలోని పలు గ్రామాల్లో చిన్నారులకు శనివారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ వ్యాక్సినేషన్‌ను పెద్దాపురం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పి.సరిత పరిశీలించారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ఏలేశ్వరం: విశ్వహిందూ పరిషత్ అధ్వర్యంలో పట్టణంలో శనివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గా వాహిని మహిళా సంఘం సభ్యులు సహస్రనామార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లలితా పారాయణ, విష్ణుపారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీబీ ప్రసాద్, కటకం కిరీటి, గుర్రయ్య, రమణారావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



తునిలో పేదలకు సరకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ లోవరాజు

తుని: అంబేడ్కర్ యూత్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రముఖ వైద్యుడు చోడిశెట్టి లోవరాజు అన్నారు. కొట్టాం సెంటర్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం అంబేడ్కర్ యూత్ అధ్వర్యంలో 100 మంది పేదలకు బియ్యం, పప్పు దినుసులు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యుడు రామకృష్ణ మృతి



బొండా రామకృష్ణ (ఫైల్)

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బొండా రామకృష్ణ (53) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఆరోగ్యం విషమించడంతో గత బుధవారం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రామకృష్ణ పెద్దిపాలెం, వేములపాలెం, ఇ.గోకవరం, కిత్తమూరిపేట పరిసర గ్రామాల ప్రజలకు గత 25 ఏళ్లుగా వైద్య సేవలు అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

చివరిలో కొండంత అండ

- మార్చి నెలాఖరు వరకూ ధాన్యం కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్
- ఇప్పటికే ప్రకటించిన జిల్లా అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న మెట్ట రైతులు



ఎస్సార్‌పేటలో ధాన్యం సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

కోటనందూరు: ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలిచింది. మెట్ట ప్రాంత రైతుల ఇబ్బందుల దృష్ట్యా ఫిబ్రవరి నెలాఖరు నాటికి ముగియాల్సిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్చి నెలాఖరు వరకూ పొడిగించింది. మెట్ట ప్రాంతంలో పండించిన చివరి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఈ మేరకు క్రిందిస్థాయి అధికారులకు సైతం ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం నిర్ణయం పట్ల మెట్ట ప్రాంత వరి రైతుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

38 వేల ఎకరాల్లో..

తుని సబ్‌డివిజన్ పరిధిలోని తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో ఈ ఏడాది 38 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అనుకూల వాతావరణం, రెట్టింపు వర్షాలతో గణనీయమైన దిగుబడులు వచ్చాయి. అయితే తుని సబ్ డివిజన్ పరిధిలో కోతల సమయంలోనే రబీ పంటగా అపరాల (పెసర, మినుము)విత్తనాలు చల్లుతారు. వరి కోతలు జరిగే సమయానికి అపరాల పంట ఎదగడంతో కోసిన పంటను పొలాల నుంచి బయటకు తెచ్చే వీలుండగా ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో నూర్పిడులు చేస్తుంటారు. నిబంధనల ప్రకారం ఫిబ్రవరి నాటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసేస్తే మెట్ట ప్రాంత రైతులకు ఇబ్బందులు తప్పవు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల ద్వారా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మార్చి నెలాఖరు వరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగేలా అనుమతులు జారీ చేశారు.

రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం, కొనుగోలు చేయాల్సిన ధాన్యం వివరాలు

మండలం	కొనుగోలు చేసిన ధాన్యం (క్వింటాళ్లలో)	కొనుగోలు చేయాల్సిన ధాన్యం (క్వింటాళ్లలో)
కోటనందూరు	1,10,000	1,60,000
రౌతులపూడి	35,930	18,750
తొండంగి	60,573	2,852
శంఖవరం	15,610	1500
తుని	88,250	87,250
మొత్తం	3,10,363	2,70,352

మంత్రి రాజా కృషితో..

ఈ ఏడాది సాగు చివరిలో తుపాను రైతులపై పంజా విసిరింది. మెట్టప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురవడంతో కొంతమేర వరిపంట పనలు, కుప్పలపై తడిచిపోయింది. దీంతో తడిసిన ధాన్యం రంగు మారింది. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోలులో కొంత గందరగోళం నెలకొంది. సమస్యను మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్లడంతో ఉన్నతాధికారులతో చర్చించి అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాలు మరికొంతకాలం పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.

100 శాతం ధాన్యం కొనుగోలు



మెట్ట ప్రాంతంలో ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో ధాన్యం నూర్పుడం పరిపాటి. ధాన్యం కొనుగోలు విషయంలో ఈ ప్రాంత రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మంత్రి దాడిశెట్టి రాజా కృషితో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీంతో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ స్పందించి ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలును మార్చి నెలాఖరు వరకూ కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మెట్టలో 100 శాతం ధాన్యం కొనుగోలుకు అవకాశం ఏర్పడింది. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– లంక ప్రసాద్, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్

ఘనంగా శాంతిహోమం



స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని ఆనుకుని నిర్మించిన శ్రీవారి పుష్కరిణి ప్రారంభ, విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం యాగశాల ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ, మహాకుంభ చక్రాబ్జ మండల ఆరాధన, కలశారాధన, జలాధివాసం, శాంతి హోమం, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ చైర్మన్ కోలా భీమేశ్వరరావు, గోవింద మాలధారణ భక్తులు వేద, దివ్య ప్రబంధ పారాయణ చేశారు. అనంతరం పండితులు స్వామివారికి విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మార్చి 1న మహాలక్ష్మి అమ్మవారు, పాండురంగస్వామి, వరాహ స్వామి, హయగ్రీవ, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాలను రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా దంపతులు ప్రతిష్ఠించి, శ్రీవారి పుష్కరిణి ప్రారంభిస్తారని ఆలయ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కాకినాడ ఎంపీ వంగా గీత, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. ఈ మేరకు భద్రతా ఏర్పాట్లు చేసేందుకు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ పుష్కరిణి, దేవస్థానం ప్రాంగణాన్ని పరిశీలించారు.

బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌ను సత్కరిస్తున్న బీసీ సెల్ అధ్యక్షుడు అప్పారావు

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ఈగల అప్పారావు శనివారం శంఖవరంలో ఎమ్మెల్యే పూర్ణచంద్రప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో 18 స్థానాలకు గాను 11 స్థానాలు బీసీలకు కేటాయించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, వేమన సురేష్, ఈగల విజయదుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు కోన బాబ్జి, ఈగల గంగ, ఎర్ల సత్యనారాయణ, ఈగల మాణిక్యాలరావు, మామిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యదేవుని ప్రాకారసేవ



రత్నగిరిపై స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలు, బాజా భజంత్రీలు, భక్తులు నడుమ ఆలయప్రాకారంలో మూడు సార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు మళ్లీ పూజలు చేసి ఊరేగింపుగా ప్రధానాలయానికి చేర్చారు. వేద పండితులు యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, చిట్టి శివ ఘనపాఠి, ఏఈఓ కృష్ణారావు, సూపరింటెండెంట్ రమణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటిబాబును కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి పద్మశ్రీ



ఇర్రిపాకలో ఎమ్మెల్యే చంటిబాబును కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి పద్మశ్రీ

జగ్గంపేట: ఉభయ గోదావరి జిల్లాల గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ శనివారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును ఇర్రిపాకలో మర్యాద పూర్వకంగా కలిశారు. తన అభ్యర్థిత్వానికి సహకరించినందుకు గాను ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట కుడా వైస్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి నారాయణరావు, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత

వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నియమితులైన వర్ధినీడి సుజాత శనివారం ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును కలిశారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే చంటిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు కాపు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

శంఖవరంలో ఎమ్మెల్యే పర్వతను కలిసిన పద్మశ్రీ

శంఖవరం: ఉభయ గోదావరి జిల్లాల గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ శనివారం ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే స్వగ్రామం శంఖవరంలో ఎమ్మెల్సీ అభ్యర్థికి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పద్మశ్రీ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన



జగ్గంపేటలో విద్యార్థినులకు దిశ చేతనపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై విద్యాసాగర్

జగ్గంపేట: విద్యార్థినులు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన పెంచుకోవాలని స్థానిక ఎస్సై విద్యాసాగర్ సూచించారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు శనివారం దిశ చేతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఎస్సై విద్యాసాగర్ మాట్లాడుతూ ఫేస్‌బుక్, వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా అపరిచిత వ్యక్తులతో స్నేహం చేయడం మంచిది కాదన్నారు. ప్రేమ, పెళ్లి పేరుతో కొంతమంది మోసం చేస్తారని జాగ్రత్తగా ఉండాలన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లల పరిస్థితిని గమనించి జాగ్రత్తలు చెప్పాలన్నారు. అనంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా గ్రామోత్సవం



సిరిపురంలో సాయిబాబా గ్రామోత్సవం

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో శనివారం సాయిబాబా గ్రామోత్సవం ఘనంగా జరిగింది. షిర్డీసాయి బాబా ఆలయ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ అధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. అర్చకుడు శిష్ట సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బాబాకు కాకడ హారతి, క్షీరాభిషేకం, పుష్పాభిషేకం చేయనున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెలుగూరి హరేరాం, దనేకుల రామకృష్ణ, మదినే బేబీ, అచ్చే సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



గృహనిర్మాణాల ప్రగతిపై లబ్ధిదారులతో సమీక్షిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ వీణాదేవి

గోకవరం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పి.వీణాదేవి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డి, వెదురుపాక లే అవుట్లలో లబ్ధిదారులతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. గృహనిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయి, నిర్మాణానికి అవసరమైన సామగ్రి సక్రమంగా అందుతున్నాయా? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. మొత్తం 328 లబ్ధిదారులకు సంబంధించి గృహ నిర్మాణాలు నాలుగు స్థాయిల్లో ఉన్నట్లు గుర్తించారు. 150 మార్చి నాటికి 150 ఇళ్లను పూర్తి చేయాలన్నారు. గృహనిర్మాణ సంస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుందం శ్రీనివాసరావు, ఈఓ రాజేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిబాబు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పరిశీలన

కిర్లంపూడి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్ లబ్ధిదారులకు సూచించారు. మండల పరిధి కృష్ణవరంలో జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలను హౌసింగ్ ఏఈ జీవీవీ సత్యనారాయణతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులు వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఏలేశ్వరం: పట్టణంలోని టీబీ (క్షయ) రోగులకు లయన్స్ క్లబ్ అధ్వర్యంలో శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి టీబీ విముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి శైలజ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు పది మంది టీబీ రోగులను దత్తత తీసుకొని ఆరు నెలలు పాటు పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీఓలు, ప్రముఖులు టీబీ రోగులను దత్తత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సురేష్, టీబీ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గా వెంకట ప్రసాద్, జ్యోతుల శ్రీనివాస్, తాళ్లూరి గొల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

ఏలేశ్వరం: జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలంటూ జనసేన పార్టీ అధ్వర్యంలో శనివారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వరుపుల తమ్మయ్యబాబు అధ్వర్యంలో జాతీయరహదారిపై చిన్నింపేట వద్ద కాగడాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తమ్మయ్యబాబు మాట్లాడుతూ జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదల నివారణకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెంటకోట మోహన్, అచ్చే వీరబాబు, నల్లాల రామకృష్ణ, సాయి వెంకటరమణ, వరుపుల సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

52 మందికి వైద్య పరీక్షలు



కొండయ్యపేటలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాంబాబు నాయక్

కిర్లంపూడి: స్థానిక కొండయ్యపేట రామాలయం వద్ద శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బి.రాంబాబునాయక్ 52 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 64 రకాల మందులు, 14 రకాల రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ జి.గంగా, ఏఎన్ఎం ప్రమీలా, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జె.కొత్తూరులో ఉచిత వైద్య శిబిరం

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరులో సీయోను ప్రేయర్ టెంపుల్ మినిస్ట్రీస్ అధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వీఆర్ నర్సింగ్ హోం, ఫ్యామిలీ హెల్త్ కేర్ సెంటర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని పారిశ్రామిక వేత్త కర్రి శ్రీనివాసరెడ్డి, జె.కొత్తూరు సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరరావు ప్రారంభించారు. వీఆర్ నర్సింగ్ హోమ్ డాక్టర్ వరకుమార్ 400 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సీయోన్ ప్రేయిర్ టెంపుల్ మినిస్ట్రీస్ చైర్మన్ కుమార్ పాల్, సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మెంబర్‌కు అభినందనలు



జగ్గంపేటలో మహేష్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రంథాలయ సంస్థ సభ్యులు

జగ్గంపేట: రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మెంబర్‌గా నియమితులైన జగ్గంపేటకు చెందిన జీను మహేష్ బాబుకు శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు. కాకినాడ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భర్త దూలం వెంకన్న బాబు, కార్యదర్శి వరప్రసాద్, జగ్గంపేట గ్రంథాలయాధికారి ఉదయభాస్కరరావుతో పాటు మరికొంత మంది జగ్గంపేటలో జీను మహేష్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో గ్రంథాలయాల నిర్వహణ, చేపడుతున్న పనులు గురించి ఆయనకు వివరించారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే కాకినాడ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వైడీ రామారావు జీన్ మహేష్‌బాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న పుస్తక నిక్షిప్త కేంద్రం నిర్వాహకులు, జిల్లా సమాఖ్య సభ్యులు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మెంబర్ జీన్ మహేష్‌బాబును కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు.

రేపు డయల్ యువర్ డీఎం

కాకినాడ: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, ఫిర్యాదులు, సూచనలపై సోమవారం ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్టు ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ చెప్పారు. ప్రయాణికులు మొబైల్ నెంబర్ 99592 25534 నెంబర్‌కు డయల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ అధికారులు సద్వినియోగం చేసుకుని సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

బాధిత కుటుంబాలకు చేయూత



చింతలూరు బాధిత కుటుంబాలకు నగదు అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు జనతా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అండగా నిలిచింది. అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన దుమ్ముల సుశీల, బొండు అప్పలకొండ కుటుంబాలకు జనతా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు అల్లు వరహాలు అధ్వర్యంలో శనివారం బియ్యం, నిత్యావసర సరకులు, రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో జనతా హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు అప్పలరాజు, నాగు, రాజ్ కుమార్, సోమేష్, నాని, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలాడుతున్న ఏడుగురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాక గ్రామ శివారులో కోడి పందేలపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.3200 స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు.

వీఏఏలకు శిక్షణ

కోటనందూరు: స్థానిక వ్యవసాయ క్షేత్రంలో శనివారం వైఎస్సార్ పొలంబడిలో భాగంగా వీఏఏలకు అపరాల సాగుపై ఏఓ చంద్రశేఖర్ శిక్షణ ఇచ్చారు. అపరాల కోతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైతులు అపరాల విత్తనాలు తయారు చేసుకొని దాచుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. అపరాలు సాగు చేసిన ప్రతిరైతుకు ఈ-కేవైసీ చేయాలన్నారు. అనంతరం అపరాల సాగు చేసిన పొలాన్ని సందర్శించారు. ఏఈఓ శివ కుమారి పాల్గొన్నారు.